సాక్షి నాగర్‌కర్నూల్


ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



తాలూకా క్లబ్‌కు మంగళం

జడ్చర్ల తాలూకా క్లబ్‌ను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేశారు.

వివరాలు 8లో ▸



అందరికీ అభిషేక భాగ్యం

శివరాత్రి రోజున భక్తులు శివుడికి అభిషేకం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు ఈఓ పురేందర్ అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /18.1

ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగడమేగాక అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కొల్లాపూర్: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శనివారం కొల్లాపూర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీతో పాటు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు మాట్లాడారు. పక్కా ఇళ్ల స్థలాలను కేటాయించడంతో, ఇళ్లు కట్టించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి స్థలాల ఉన్న వారికి ఇళ్ల నిర్మాణాల కోసం రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 500 మంది అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, నర్సింహ్మ, శివవర్మ, శ్రీనివాసులు, సలీం, బాలపీరు, భాస్కర్‌నాయక్, అశోక్, రాజు, సురేందర్ తదితరులున్నారు.

8 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కందనూలు: ఈనెల 8వ తేదీ నుంచి రేషన్ పీడీఎస్ బియ్యంను పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాప్ డీలర్లకు బియ్యం పంపిణీ చేయటం ఆలస్యమైందని తెలిపారు. రేషన్ డీలర్లు, కార్డుదారులు దీనిని గమనించాలని తెలిపారు.

శనేశ్వరుడికి రుద్రాభిషేకం



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో శివుడికి శనివారం రుద్రాభిషేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి నిర్వహించారు. భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచే జేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి తిలతైలాభిషేక, అష్టోత్తర పూజల అనంతరం ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో శివుడికి క్షీరాభిషేక, జలాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు శేఖర్, ప్రభాకర్‌చారి, అర్చకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కందనూలు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎస్ రామ్‌లాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాల క్రీడా మైదానంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను శనివారం నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల జిల్లా స్థాయి క్రీడలను జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామ్ లాల్ ప్రారంభించి మాట్లాడారు. పరుగుపందెం, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తుంచగా, సుమారు 170 మంది పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ గోవిందరాజులుచే విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి ప్రసాద్ గౌడ్, పీఈటీలు శ్రీనివాస్ గౌడ్, రమేష్, శేఖర్ బాబు, సురేందర్ వెంకటయ్య, సీతారాం పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రవాణా రంగాన్ని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మందికి పైగా కార్మికులు ఈ రంగంలో పనిచేస్తున్నారని, వారికి సంక్షేమ బోర్డు లేకపోవడం వల్ల కార్మికులకు ఎలాంటి సహాయం అందడం లేదని ఆరోపించారు. కేరళ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సవారీ యాప్ తరహా యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేవాలన్నారు. కురుమూర్తి, ఆనంద్, శివ, మహేశ్, సాయికుమార్, రాము పాల్గొన్నారు.

నృసింహుడి మకుటం.. సింగోటం

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు

సింగోటంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఈ ప్రాంతానికే మకుటంగా నిలవబోతోంది. కొల్లాపూర్, వనపర్తి, కర్నూలు జిల్లా నందికొట్కూరు ప్రాంతాలకు చెందిన భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఈ ఆలయాన్ని ఆధునీకరించేందుకు స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి రెండేళ్ల క్రితం సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. ఈ మేరకు 2021 డిసెంబర్ 2న ఆలయ పునర్నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) నిధులు రూ.15 కోట్లు మంజూరు చేశారు. వీటితో ఆలయాన్ని యాదాద్రి తరహాలో తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతుండటంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..


– కొల్లాపూర్

- స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కేటాయింపు
- డిజైన్లలో మార్పులు చేపట్టాలని కోరిన ట్రస్టీ
- యాదాద్రి తరహాలో అభివృద్ధికి చర్యలు
- త్వరలోనే ఆలయాన్ని సందర్శించనున్న దేవాదాయశాఖ కమిషనర్

సండే స్పెషల్



లక్ష్మీర్సింహస్వామి మూలవిరాట్



పునర్నిర్మాణం కోసం రూపొందించిన ఆలయ నమూనా

స్వయంభూగా వెలసిన సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సమూలంగా మార్పు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఆలయం, ప్రాకారం మొత్తం తొలగిస్తారు. ఒక్క గర్భగుడిని మాత్రమే ఉంచి మిగతా అంతా కొత్తగా నిర్మించనున్నారు. సువిశాలంగా, భక్తులకు సౌకర్యంగా ఉండడంతోపాటు విశేష పూజల నిర్వహణకు అనువుగా నూతన నిర్మాణాలు చేపట్టబోతున్నారు. ఇందుకోసం రూ.5.76 కోట్లు ఖర్చు చేయనున్నారు. గుడి నిర్మాణం పూర్తిగా వాస్తుశాస్త్రం ప్రకారం చేపట్టనున్నారు. అలాగే భక్తులకు కల్పించే వసతి సౌకర్యాల కోసం రూ.84లక్షలు కేటాయించారు.

కాటేజీల నిర్మాణానికి రూ.3.30 కోట్లు


సింగోటం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతోపాటు ఎక్కువగా రాయలసీమ ప్రాంత భక్తులు విచ్చేస్తుంటారు. కర్నూలు జిల్లాకు చెందినవారు చాలామంది ఇక్కడ వివాహాది శుభకార్యాలు చేసుకుంటారు. జనవరిలో జరిగే బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు వస్తారు. మిగతా సమయంలో రోజువారీగా ఆలయానికి కనీసం 500 నుంచి వెయ్యి మంది వరకు భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల కోసం ఆలయ సమీపంలోని గుట్టపై కాటేజీలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.3.30 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో దాదాపుగా 30 వరకు కాటేజీలు నిర్మించనున్నారు.

నీటి వసతులకు నిధులు

ఆలయానికి విచ్చేసే భక్తులు సమీపంలోని గుండంలో స్నానమాచరిస్తారు. ఈ గుండంలోనే ఆలయానికి సంబంధించిన మురుగు, సమీప ప్రాంతాల నుంచి వచ్చే నీరు కలుస్తోంది. గుండంలో మురుగు కలవకుండా చర్యలు చేపట్టేందుకు రూ.76 లక్షలు, ఆలయానికి తాగునీటి వసతి కల్పించేందుకు రూ.85 లక్షలు కేటాయింపులు చేశారు.

పరిశీలించనున్న కమిషనర్

ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు త్వరలోనే దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ సింగోటం రానున్నారు. ఆలయాన్ని పరిశీలించి, ఇప్పటి వరకు రూపొందించిన డిజైన్ల ప్రకారం పునర్నిర్మాణాలు చేపట్టే అంశాలను పరిశీలించనున్నారు. ఆయన పరిశీలన తర్వాతే పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.



సింగోటంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

పనుల ప్రారంభంపై సందిగ్ధం

ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఏడాది గడిచిపోగా.. పునర్నిర్మాణ డిజైన్లను రూపొందించి ఆరునెలల అయింది. అయితే పునర్నిర్మాణ పనులు ఎలా చేపట్టాలనే అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కానీ, నిర్మాణ డిజైన్లలో మార్పులు చేపట్టాలని ఆలయ ట్రస్టీగా ఉన్న సురభి రాజవంశ వారసుడు ఆదిత్య లక్ష్మారావు కోరడంతో పనుల ప్రారంభం ఆలస్యమైనట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి జోక్యం చేసుకుని ఇటీవల హైదరాబాద్‌లో ఆదిత్య లక్ష్మారావుతోపాటు దేవాదాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. పనులు త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

డిజైన్లు పూర్తి..

ఆలయ పునర్నిర్మాణ పనులు ఏవిధంగా చేపట్టబోతున్నారనే అంశాలను పరిశీలించేందుకు దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ త్వరలోనే సింగోటం వస్తారు. ఇప్పటికే నిర్మాణ పనులకు సంబంధించిన డిజైన్లు అన్నీ తయారుచేశారు. అయితే డిజైన్లలో మార్పులు, చేర్పుల కారణంగా పనుల ప్రారంభం ఆలస్యమైంది. కమిషనర్ పర్యటన తర్వాత పనులు ప్రారంభమవుతాయి.

– రంగారావు, ఈఓ

అధికారులను కోరాం..



సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉంది. తెలంగాణతో పాటు, రాయలసీమ భక్తులు కూడా ఇక్కడికి వస్తుంటారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించా. అవసరమైతే అదనపు నిధులు కూడా ఇస్తామన్నారు. వాస్తు, ఆగమశాస్త్ర నియమాల ప్రకారం పునర్నిర్మాణం జరుగుతుంది. కొన్ని కారణాలతో పనుల ప్రారంభంలో ఆలస్యమైంది. పనులు త్వరితగతిన ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారులను కోరాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

భూసేకరణ కోసం..

ఆలయాన్ని ఆధునీకరించేందుకు అవసరమైతే సమీప ప్రాంతాల్లోని భూములను సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.3.49 కోట్లు కేటాయించారు. ఆలయంలో ప్రాకారాలు, ఆలయ ఉద్యోగులు, పురోహితుల విడిది, కల్యాణ మంటపం, అన్న సత్రాలు నిర్మించేందుకు భూమి అవసరమవుతుంది. భూ సేకరణ చేపట్టకుంటే ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

మెరుగైన పునరావాసం కల్పిస్తాం



పునరావాస కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: డిండి బ్యాన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలించి మెరుగైన పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ అన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామాలైన కేశ్యతండా, మార్లతండ, పెద్దలతో ప్రాజెక్టు లెవల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం 347 కుటుంబాలను గుర్తించి వీరికి అవసరమైన మౌళిక సదుపాయాలతో కూడిన పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు, ఏజెన్సీ ఏరియాలో ఉన్నందున మరో 10వేలు తరలింపు ప్రక్రియకు అదనంగా మరో రూ.50వేలు ఒక్కో కుటుంబానికి నెలకు రూ.3వేల చొప్పున 12నెలలకు రూ.36వేలు, ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన కింద ఒక్కో కుటుంబానికి రూ.7.61లక్షలు ఇవ్వడం జరగుతుందని అన్నారు.

అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలి

పునరావాస కమిటీ సభ్యుడు, సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ మరో చోట స్థలం కేటాయించి పునరావాసం కల్పించాలని, ఒక్కో కుటుంబానికి 250 గజాల స్థలాన్ని కేటాయించాలని, రేటు విషయంలో కూడా మరోసారి ఆలోచించాలని అభ్యర్థించారు. స్పందించిన కలెక్టర్ స్థలం విషయంలో ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులు మరోమారు పరిశలించి బాధితుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని వాస్తవిక పరిస్థితులను ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, అచ్చంపేట ఆర్డీఓ పాండు, ఇరిగేషన్ డీఈ చక్రపాణి, డీలింగ్ అసిస్టెంట్ లింగమయ్య, పునరవాస కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌సీ వార్డును నూతన భవనంలోకి మార్చండి

అచ్చంపేట: అచ్చంపేటలో నూతనంగా నిర్మించిన వంద పడకల అస్పత్రి భవనంలోకి స్పెషల్ న్యూనేటల్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీ) తరలించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఏరియా అస్పత్రిని టాకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం ఎస్ఎన్‌సీ కేర్ యూనిట్ మార్చడం వల్ల చెంచుల కోసం నిర్మించిన వార్డు ఇక్కడికి వచ్చే రోగులకు సౌకర్యంగా ఉంటుందని, కాన్పు కోసం వచ్చే వారు విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుందని సూచించారు. రోగులు,గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. నలుగురు వైద్యులు గైరాజర్ కావడంపై ఆయన మండిపడ్డారు. తనిఖీ సమయంలో సూపరింటెండెంట్ కృష్ణ, ఆర్డీఓ పాండునాయక్,తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మనోధైర్యంతో రోగాలను జయించండి

జిల్లా జడ్జి రాజేష్‌బాబు



జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: రోగుల జీవితాల్లో చిరునవ్వే వెలుగు నింపుతుందని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రాజేష్ బాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ సర్వైవర్స్ దినోత్సవం సందర్భంగా శనివారం జనరల్ ఆస్పత్రిలో క్యాన్సర్ రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో మంచి వైద్యులు ఉన్నారని, రోగులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా డాక్టర్లకు సమాచారం ఇచ్చి తగిన సహాయం పొందాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న, ఆపరేషన్లు చేయించుకున్న వారితో మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. క్యాన్సర్ వ్యాధి అంటే భయపడాల్సిన పనిలేదని, ప్రస్తుతం అనేక మందులు వచ్చాయన్నారు. క్యాన్సర్ రాకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏటా క్యాన్సర్ సర్వైవర్స్ డే సందర్భంగా అధికారులు వివిధ మండలాలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరు పొగాకు వాడకుండా దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో 12,749 మందికి పరీక్షలు నిర్వహించగా 459 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నివేదిక వెల్లడిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, అదనపు పీపీలు శ్యాంప్రసాద్‌రావు, భవానీబాయి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు, వైద్యులు రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండను తవ్వి ఎలుకనూ పట్టలే..!

- సివిల్ సప్లయ్ అధికారుల యవ్వారం
- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సీఎమ్మార్ దందా
- మిల్లుల నుంచే కర్ణాటకకు తరలుతున్న ధాన్యం
- మిల్లర్లే సూత్రధారులు.. వారికే అధికారుల అండ
- రాజకీయ నేతల మద్దతుతో ఇష్టారాజ్యం
- గట్టులో పట్టుబడిన ధాన్యం లారీ రిలీజ్‌పై అనుమానాలు
- ఓ ముఖ్య నేత పైరవీ.. కుదిరిన బేరసారాలు?



చింతలకుంట మిల్లులో లారీలోకి లోడ్ చేస్తున్న వడ్ల బస్తాలు (ఫైల్)



గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వడ్ల లారీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎమ్మార్ ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఘటనలు ఉమ్మడి జిల్లాలో కోకొల్లలు. అయితే ఒకటి, రెండు సందర్భాలను మినహాయిస్తే అంతా సక్రమమేనని తేల్చారు. అక్రమార్కుల నుంచి నెలనెలా అందుతున్న ముడుపులు.. పట్టుబడిన క్రమంలో రాజకీయ నేతల పైరవీలతో పెద్దమొత్తంలో తగులుతున్న జాక్‌పాటే ఇందుకు కారణం. ఆ తర్వాత అందరి కళ్లుగప్పి షరా మామూలుగా ఆ వాహనాలు రాష్ట్ర సరిహద్దులు దాటి కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలడం సహజం. ఇది ఎక్కడో ఓ జిల్లాకేంద్రంగా జరుగుతోందని భావిస్తే పొరపడినట్లే. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఈ కొత్త పంథా కొనసాగుతోంది. అవినీతికి అలవాటు పడిన పలువురు సివిల్ సప్లయ్ అధికారులే ఈ వ్యూహాన్ని పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్కెచ్ వేసి పట్టుకుని.. ఆ తర్వాత బేరసారాలు కుదుర్చుకుని వదిలేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులో గురువారం పట్టుబడిన ఘటనలో అధికారులు కొండను తవ్వి ఎలుకను కూడా పట్టనట్లు వ్యవహరించడమే ఉదాహరణగా నిలుస్తోంది.

కోస్గి కేంద్రంగా రేషన్ బియ్యం..

నారాయణపేట జిల్లా కోస్గి కేంద్రంగా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. నాగుసాన్‌పల్లి-సంపల్లి మధ్య అటవీ ప్రాంతంలోని ఓ తోటలో రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న లారీ, రెండు డీసీఎంలు, ఒక బొలేరో వాహనాన్ని కొందరు యువకులు పట్టుకున్నారు. పోలీసులకు ముందస్తుగానే సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. సోషల్ మీడియాలో నాలుగు వాహనాలు ఉన్నట్లు స్పష్టమవుతున్నా.. రెండు మాత్రమే పట్టుబడినట్లు పోలీసులు చెప్పడం విమర్శలకు దారితీసింది. తప్పించిన రెండు వాహనాల్లో 600 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం. ఈ మాయమైన రెండు వాహనాల ఉదంతంలో ఓ అధికార పార్టీకి చెందిన నేత ప్రమేయం ఉన్నట్లు తెలిసింది.

అప్పుడు అలా..

గతేడాది కర్ణాటకలో ధాన్యం మద్దతు ధర ఇక్కడి కంటే తక్కువ పలికింది.ఈ క్రమంలో పలువురు మిల్లర్లు ఆ రాష్ట్రంలోని రాయచూర్, దొల్తాబాద్ తదితర ప్రాంతాల నుంచి ధాన్యాన్ని ప్రధానంగా పాలుమూరులోని జోగుళాంబ గద్వాల, నారాయణపేట తదితర జిల్లాలకు తరలించి క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.500 ఎక్కువ ధరతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. గతేడాది మే 19న కర్ణాటక రాష్ట్రం నుంచి గద్వాల జిల్లాకు తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే రెండు రోజుల తర్వాత అనుమతి పత్రాలు సృష్టించి వాహనాలను విడిపించుకుని వెళ్లారు. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ మండల స్థాయి నాయకుడు.. ఓ ముఖ్య నేతతో రాయబారం నడిపించినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఇప్పుడు ఇలా..

ప్రస్తుతం తెలంగాణలో ధాన్యానికి పలుకుతున్న మద్దతు ధర కంటే కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. క్వింటాల్‌కు ఇక్కడ రూ.2,060 ఉండగా.. అక్కడ రూ.2,300 నుంచి రూ.2,800 వరకు పలుకుతోంది. ఈ క్రమంలో మిల్లర్లే సీఎమ్మార్ వడ్లనే బ్లాక్ మార్కెట్ తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గురువారం గద్వాల జిల్లా గట్టు మండలం చింతలకుంటలోని ఓ రైస్ మిల్లు నుంచి వడ్లను తరలిస్తున్న సమయంలో సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేసి పట్టుకోవడం ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. వనపర్తిలో ఓ ముఖ్య నేతతో పాటు ఓ రెవెన్యూ జిల్లాస్థాయి అధికారి అండదండలు పుష్కలంగా ఉండడంతో రైస్ మిల్లర్ల అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలు అన్న తరహాలో సాగుతున్నట్లు సమాచారం.

అనుమానంతోనే ఆపాం..

చింతలకుంట రైస్ మిల్లు నుంచి వడ్లను తరలిస్తున్న లారీని అనుమానంతోనే పట్టుకోవడం జరిగింది. చింతలకుంట మిల్లులో తనిఖీ చేశాం. ప్రభుత్వం సేకరించి అప్పగించిన వడ్ల బస్తాలు అలాగే ఉన్నాయి. విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం. పట్టుబడిన వడ్ల లారీని రిలీజ్ చేయాలని వారు ఆదేశించారు.

– కేశవ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, గద్వాల

గట్టులో లోగుట్టు ఏమిటో?

కర్ణాటక సరిహద్దు గ్రామమైన చింతలకుంటలోని ఓ రైస్ మిల్లు నుంచి 354 బస్తాల వడ్లను కర్నూలుకు లారీలో తరలిస్తుండగా మాచర్ల గ్రామ శివారులో గద్వాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే అవి సీఎమ్మార్ రైస్ కాదని సివిల్ సప్లయ్ అధికారులు జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు సమాచారం. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున పైరవీలు, బేరసారాలు జరిగినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన మిల్లర్.. అదే పార్టీకి చెందిన ముఖ్య నేత అండతో లారీని విడిపించినట్లు సమాచారం.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


పుట్టా నిరంజన్ (ఫైల్)

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన రైతు పుట్టా నిరంజన్ (38) విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. నిరంజన్ సాగుచేసిన వేరుశనగ పంటకు నీరందించేందుకు శనివారం బోరుమోటారు స్టార్టర్ ఆన్ చేస్తుండగా.. తెగి ఉన్న తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నిరంజన్‌కు భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి అన్న పుట్టా మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని.. యువకుడి బలవన్మరణం


ఇస్లావత్ శివ (ఫైల్)

బాలానగర్: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయిన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మేడిగడ్డతండాలో శనివారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. మోతీఘనపూర్ పంచాయతీ పరిధిలోని మేడిగడ్డతండాకు చెందిన ఇస్లావత్ శివ(28)తో భార్య కవిత 20 రోజుల కిత్రం గొడవపడ్డారు. దీంతో ఆమె గుండేడ్ పంచాయతీ పరిధిలోని పంచాంగులగడ్డతండాకు వెళ్లిపోయింది. శనివారం పంచాంగులగడ్డ తండాకు వెళ్లిన శివ భార్యను కాపురానికి రావాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన శివ మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాటికొండలో మరో యువకుడు..

భూత్పూర్: మండలంలోని తాటికొండకు చెందిన మ్యాతరి రాజు(27) శనివారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. తాటికొండకు చెందిన కుర్మమ్మ, పెంటయ్య దంపతుల రెండో కుమారుడు మ్యాతరి రాజు అడ్డాకుల మండల పొన్నకల్‌కు చెందిన గుంపు మేస్త్రీ వద్ద కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తన అన్నకు ఫోన్ చేసి మాట్లాడాడు. అకస్మాత్తుగా గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న వెంకటయ్య వ్యవసాయ పొలంలోని చెట్టుకు ఉరేసుకొని మృతిచెందగా.. గుర్తించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై రాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాగులో పడి వ్యక్తి..

మక్తల్: మండలంలోని ముస్లిపల్లి వాగులో పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని భగవాన్‌పల్లికి చెందిన బోయ ఆశన్న(59) గతేడాది డిసెంబర్ 29 నుంచి కనిపించడం లేదని భార్య అమ్మక్క జనవరిలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాగులో చేపలు పట్టేందుకు వెళ్లగా ఆశన్న మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి..

బిజినేపల్లి: కేఎల్ఐ కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆవంచ గ్రామానికి చెందిన అమ్మపల్లి నర్సింహ(55) గురువారం సాయంత్రం వరి పొలానికి నీళ్లు పెట్టడానికి కేఎల్ఐ కాల్వ వద్దకు వెళ్లాడు. అక్కడి మోటారులో నాచు తొలగిస్తుండగా జారి కాల్వనీటిలో పడిపోయి మృతిచెందాడు. గమనించిన భార్య సత్తమ్మ స్థానికులకు, పోలీసులకు తెలియజేసింది. కానీ మృతదేహం లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం కాల్వలో తేలడంతో బయటికి తీశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్ మైనోద్దీన్‌పాషa తెలిపాడు.

చెరువులో మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కొట్ల నర్సింహ(49) మృతదేహం స్థానిక చౌట చెరువులో లభ్యమైనట్లు అడ్డాకుల ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన నర్సింహ బుధవారం రాత్రి చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. కట్టపై దుస్తులు, చెప్పులను వదిలి చెరువులోకి దిగాడు. అనుకోకుండా నీటిలో మునిగిపోయాడు. మరుసటి రోజు చెరువు కట్టపై దుస్తులు, చెప్పులు కనిపించడంతో స్థానికులు నర్సింహ కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చెరువులో మృతదేహం కనిపించగా.. కుటుంబసభ్యులు నర్సింహదేనని గుర్తించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ చెప్పారు.

తాలూకా క్లబ్‌కు మంగళం!



జడ్చర్ల తాలుకా క్లబ్

- కనుమరుగు కానున్న ల్యాండ్ మార్క్
- రూ.6.75 కోట్లకు విక్రయం
- సభ్యుల్లో ఆందోళన

జడ్చర్ల: జడ్చర్లలో తాలూకా క్లబ్ పేరు ఈ పట్టణంలో ప్రసిద్ధి. ఊరందరిలో చిన్నా పెద్దా అందరికీ ఏళ్లుగా తెలిసిన ప్రాంతం ఇది. పట్టణానికి పడమర దిక్కున దినదినాభివృద్ధి చెందుతున్న ప్రాంతం క్లబ్ ఏరియా మాత్రమే అంటుంటారు. ఇటీవల ఆ ఏరియాకు మంచి డిమాండ్ కూడా వచ్చింది. పట్టణంలో నుంచి మాత్రమేగాక 167 నంబర్ జాతీయ రహదారి నుంచి బెంగళూర్– హైదరాబాద్ హైవే (44వ నంబర్ జాతీయ రహదారి) పైకి క్లబ్ ఏరియా గుండా త్వరగా చేరుకోవచ్చు. దీనివల్ల భవిష్యత్‌లో మరింతగా ఆ ప్రాంతానికి డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయి. అలాంటి ప్రాంతంలోని ల్యాండ్‌మార్క్‌గా ప్రజల మనస్సులో స్థిరంగా నిలిచిన తాలూకా క్లబ్ భవనాన్ని విక్రయించాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవు ఇద్దరు ముగ్గురు రియల్ వ్యాపారులకు సమాచారం అందించి, విక్రయించారు. ఈ విషయం తెలియడంతో కొందరు క్లబ్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రూ.6.75 కోట్లకు విక్రయం..

తాలూకా క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన వేలంపాటలో ఓ రియల్‌వ్యాపారి రూ.6.75 కోట్లకు కొనుగోలు చేశాడు. 1981–82 సంవత్సరంలో పట్టణానికి చెందిన పలువురు పెద్దలు పట్టణంలో ఓ క్లబ్ ఉండాలని ఆలోచించి ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసి అందులో భవనాన్ని నిర్మించారు. క్లబ్‌లో పిల్లలు, వయో వృద్ధులు, యువతకు సైతం అందుబాటులో ఆటలు, వ్యాయామం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం, సాయంత్రం ఆటలతో పాటు వ్యాయామం, వాకింగ్, యోగా, ధ్యానం, శారీరక, మానసిక ప్రశాంతతకు ఉపయోగపడేలా క్లబ్‌ను తీర్చిదిద్దారు. సందర్భోచితంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సమాజ సేవా కార్యాక్రమాలను ఆయా క్లబ్‌ల ఆధ్వర్యంలో చేపట్టి ప్రజలకు తమ క్లబ్‌ల ఉద్దేశాలను తెలియజేసేవారు. కాలక్రమేణా ఈ కార్యక్రమాలకు క్లబ్ దూరమైంది. ఈ పరిస్థితుల్లోనే క్లబ్‌ను మొత్తంగా విక్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం.

150 మంది సభ్యులు..

తాలూకా క్లబ్‌లో దాదాపు 150 మంది సభ్యులున్నారు. అయితే క్లబ్‌ను సభ్యులతో పాటు పట్టణవాసులు సైతం వినియోగించుకుంటున్నారు. పట్టణంలో సువిశాల స్థలాలు పెద్దగా లేకపోవడంతో కొందరు వ్యాయామం, తదితర ఆటలు ఆడేందుకు క్లబ్ స్థలాన్ని వినియోగించుకుంటున్నారు. అయితే క్లబ్‌ను స్థలంతో పాటు గంపగుత్తగా విక్రయించడం చర్చనీయాంశంగా మారింది.

మరో దగ్గర నిర్మిస్తాం..



తాలూకా క్లబ్‌ను విక్రయించాలని నిర్ణయించాము. త్వరలోనే విక్రయించి పట్టణానికి కొద్ది దూరంలో ప్రశాంతమైన వాతావరణంలో కొత్త క్లబ్‌ను నిర్మిస్తాము. సభ్యుల నిర్ణయం ప్రకారంగానే విక్రయించాలని నిర్ణయించాము.

– మన్నెం గోవర్ధన్‌రెడ్డి, తాలూకా క్లబ్ మాజీ అధ్యక్షుడు, జడ్చర్ల

నగలు చోరీ.. రెండు గంటల్లో స్వాధీనం

- జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీలో ఘటన


దొరికిన బంగారు నగలు


విచారిస్తున్న సీఐ రమేశ్‌బాబు, తదితరులు

జడ్చర్ల: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం పట్టపగలు ఓ ఇంట్లో దొంగతనం చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కేవలం రెండు గంటల వ్యవధిలో నగలను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్ నంబర్–6లో హమీద్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌లోని తన చెల్లెలు సైదా బేగం ఇంటికి వచ్చింది. హైదరాబాద్‌లో ఓ పరీక్ష రాయడానికి వెళ్తున్న కారణంగా పరీక్ష కేంద్రంలోకి నగలు అనుమతించరని భావించిన ఆమె తన బంగారు నగలను ఇంట్లో వదిన మహమ్మదాబేగంకు అప్పగించి వెళ్లింది. పరీక్ష రాసిన అనంతరం శనివారం సైదాబేగం హౌసింగ్‌బోర్డులోని ఇంటికి వచ్చింది. అయితే అప్పటికే తన వదిన ఇంట్లో దొంగలు పడి తన ఆడపడుచు నగలతో పాటు తన నగలను అపహరించారని పేర్కొంటూ రోదిస్తుంది. దీంతో వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి అన్ని ఆధారాలు సేకరిస్తున్న సమయంలో ఇంటి పరిసరాలను సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. తమదైన శైలిలో అనుమానితులను, కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. ఈక్రమంలో ఇంటి పక్కనే సందులో నగలు చుట్టిన ఓ మూట పోలీసులకు దొరికింది. దీంతో బాధితులకు సదరు నగలను అందజేయడంతో చోరీ కథ సుఖాంతం అయ్యింది. అయితే కుటుంబ సభ్యులు లేదా చుట్టుపక్కల వారే చోరీకి పాల్పడి దొరికిపోతామన్న ఆందోళనలో నగలు పోలీసుల కంటపడే విధంగా వేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. చోరీని స్వల్పవ్యవధిలో ఛేదించిన సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐ లెనిన్‌లను స్థానిక కౌన్సిలర్ చైతు చౌహాన్, తదితరులు శాలువాతో సన్మానించి అభినందించారు.

వ్యక్తి జైలులో.. పూర్తయిన భూ రిజిస్ట్రేషన్

- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం
- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


జైలు సూపరింటెండెంట్ ఇచ్చిన ధ్రువపత్రం


భూ రిజిస్ట్రేషన్ పత్రం

నవాబుపేట: జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో తన భూమిని స్వాహా చేశారని.. న్యాయం చేయాలంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తీగలపల్లికి చెందిన గుండ్ల బాలస్వామికి గ్రామంలో 4.25 ఎకరాల భూమి ఉంది. కాగా అతడు తన అత్తను హత్యచేసిన విషయంలో 2005, మే నెల 23 నుంచి 2006, డిసెంబర్ 1వ తేదీ వరకు జైలు శిక్ష అనుభవించారు. అతడు లేకుండానే 2005, అక్టోబర్ 27న హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిపై భూమి రిజిస్ట్రేషన్ అయింది. జైలు నుంచి విడుదలైన బాలస్వామి నేరుగా ముంబై వెళ్లిపోయారు. ఇటీవల గ్రామానికి రాగా విషయం తెలిసి అవాక్కయ్యాడు. దీంతో గత నెల 23న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు భూమి రిజిస్ట్రేషన్ అయిన సమయంలో జైలులో ఉన్నట్లు జైలు సూపరింటెండెంట్ ఇచ్చిన ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పురుషోత్తం వివరించారు. ఈ వ్యవహారంలో గ్రామానికి చెందిన ఇద్దరు, బాధితుడి బంధువు, ఓ అధికారితో పాటు మరో వ్యక్తి హస్తం ఉన్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

ఆస్పత్రిలో గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన


బాధిత కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడుతున్న ఎస్ఐ యుగంధర్‌రెడ్డి

వనపర్తి క్రైం: వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతిచెందిందంటూ బాధిత కుటుంబ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. గోపాల్‌పేట మండలం ఏదులకు చెందిన శోభ (25)కు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం మూడు నెలల గర్భవతి కావడంతో అబార్షన్ చేయించేందుకు కుటుంబ సభ్యులు గురువారం జిల్లాకేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు శనివారం అబార్షన్ చేయగా రక్తస్రావం అధికమై మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. చివరకు కొందరు పెద్దలు జోక్యం చేసుకొని బాధిత కుటుంబంతో రాజీ చేయించారు. ఈ ఘటనపై ఆస్పత్రి మేనేజర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా.. రక్తస్రావం, జ్వరంతో ఆస్పత్రిలో చేరిందని.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

ఆస్పత్రిని మూయించాలి..

జిల్లాకేంద్రంలోని వెంకటసాయి ఆస్పత్రిని మూసివేయాలని శనివారం ఐద్వా మహిళా సంఘం సభ్యులు పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. వైద్యం వికటించి గర్భిణి శోభ మృతి చెందిందని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేణుక, కవిత, ఆకాశవాణి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మండల పరిధిలోని బూర్గుపల్లి సమీపంలోని రంగయ్యకుంటతండా వద్ద శనివారం బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ లెనిన్ కథనం మేరకు.. స్థానిక సంజీవయ్యకాలనీకి చెందిన కొతికే నర్సిములు (52), బంధువు బొల్లె కృష్ణమోహన్‌తో కలిసి బైక్‌పై పని నిమిత్తం రంగయ్యకుంట తండా సమీపంలోకి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న నర్సిములు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి తన భర్త మరణానికి కారణమైన బొల్లె కృష్ణమోహన్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిందపడి వ్యక్తి మృతి

అడ్డాకుల: కూర్చున్న చోటే కిందపడిన వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని కన్మనూర్ చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణయ్య(47) కొన్నాళ్ల నుంచి మూర్ఛవ్యాధి, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. శనివారం సాయంత్రం కన్మనూర్ నుంచి బలీదుపల్లి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ మ్యాన్‌హోల్‌పై కూర్చోగా మూర్ఛ రావడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. కృష్ణయ్యకు భార్య చెన్నమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనానికి నిప్పు


కాలిపోయిన బొలెరో వాహనం

అయిజ: మండలంలోని బైనిపల్లిలో చాకలి గిరెన్న బొలెరో వాహనానికి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదైనట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనానికి నిప్పు పెట్టారని.. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కూలీల కొరతకు యాంత్రీకరణే పరిష్కారం


శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా ఉందని, ఈ కొరతను తట్టుకునేందుకే యాంత్రీకరణే పరిష్కార మార్గమని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరికరాల విభాగం అధిపతి డా.పి రాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆర్‌పి హెచ్–యాక్ట్ ప్రాజెక్టులో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన ఏఈఓలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయంలో యాంత్రీకరణ గురించి అవగాహన కల్పించాలని, యాంత్రీకరణ పనితీరును వివరించాలన్నారు. వ్యవసాయంలో పరికరాలది కీలకపాత్ర అని, వీటిని వినియోగించడంతో కూలీల కొరత తగ్గడమే కాకుండా ఖర్చును కూడా తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వాతావరణ విభాగ అధిపతి డా.జి.మహదేవప్ప మాట్లాడుతూ.. ఆపత్కాల పంటలు, ప్రణాళిక, ముందస్తు వాతావరణ సూచనల ప్రాముఖ్యతను వ్యవసాయ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ డా. ఎం పరిమళ కుమార్ పాల్గొన్నారు.

కుక్కకాటుతో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమం


కుక్క దాడిలో గాయపడ్డ మనుశ్రీ


కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డ అంకిత

బాలానగర్: కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని మోతీఘనాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా... మండలంలోని మోతీఘనాపూర్ గ్రామానికి చెందిన మనుశ్రీ (6), తోట అంకిత (4)పై మధ్యాహ్నం, సాయంత్రం కుక్కలు దాడిచేశాయి. దీంతో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన కక్కులూరి రాములు కూతురు మనుశ్రీ ఇంటి పక్కనే ఆడుకుంటూ ఉండగా ఓ కక్క దాడిచేసింది. దీంతో వీపులో గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు, అదేవిధంగా తండ్రి తోట కుమార్ కూతురు అంకిత ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఉండగా సాయంత్రం ఊర కుక్కలు దాడి చేయగా, కడుపు భాగంలో తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా మారడంతో, షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు రెఫర్ చేశారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పదులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. పలుమార్లు గ్రామస్తులు కుక్కలదాడిలో గాయపడి, ఆస్పత్రుల్లో చేరారని, ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కర్రలతో దాడి.. వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన


మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి అలియాస్ జాని (35)పై అదే గ్రామానికి చెందిన రాఘవేంద్రగౌడ్, యాగంటి నాయుడు, గణేష్, రూబీ కర్రలతో దాడి చేయడంతో మృతిచెందినట్లు శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి అదే గ్రామంలో రాఘవేంద్రగౌడ్ ఇంట్లో అద్దెకు ఉండేవాడు. ఇద్దరికి గొడవ జరగడంతో అయిదేళ్ల కిందట ఖాళీచేసి కుటుంబంతో కర్నూల్‌కు మఖాం మార్చాడు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని మద్యం మత్తులో రాఘవేంద్రగౌడ్ శుక్రవారం అర్ధరాత్రి మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌చేసి గ్రామానికి రావాలంటూ సవాల్ విసిరాడు. దీంతో మధుసూదన్ రెడ్డి తనవద్ద పనిచేస్తున్న అనిల్‌కుమార్‌తో కలిసి బైక్‌పై వచ్చాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో రాఘవేంద్రగౌడ్, గణేష్, యాగంటి నాయుడు, రూబి కలిసి కర్రలతో మధుసూదన్‌రెడ్డిపై దాడి చేయగా శరీరం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడి నుంచి మధుసూదన్‌రెడ్డి, అనిల్ బైక్‌పై కర్నూలుకు బయలుదేరారు. పుల్లూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే మధుసూదన్ రెడ్డికి కళ్లు తిరగడంతో రోడ్డుపక్కన దిగి కూర్చొని అక్కడే పడిపోయాడు. ఈ విషయాన్ని అనిల్ ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు అక్కడికి చేరుకొని కర్నూలు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్న మద్దిలేటిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో రాఘవేంద్రగౌడ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఇంటి తలుపులు పగలగొట్టడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు డీఎస్పీ రంగస్వామి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మధుసూదన్‌రెడ్డికి భార్య కృష్ణవేణి, కుమార్తెలు లక్ష్మి, లలిత, కుమారుడు మహేందర్‌రెడ్డి ఉన్నారు. కోదండాపూర్ ఎస్ఐ వెంకటస్వామి, ఏఎస్ఐ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



కల్లు రుచి సూపర్

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరైన మంత్రిగారు.. పనిలో పనిగా కల్లు తాగారు. రుచి బావుందని కితాబు కూడా ఇచ్చారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో శనివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటమయ్య గుడి (కల్లు అడ్డా) వద్ద గీత కార్మికుల కోరిక మేరకు కల్లు దమ్ముపట్టి భలే బాగుందని మెచ్చుకున్నారు.

– దేవరుప్పుల

వందేభారత్‌పై రాళ్ల దాడి

ఖమ్మం క్రైం: ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై కొందరు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనపై ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఖమ్మం ఆర్పీఎఫ్ పోలీసులకు ఫోన్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం సాయంత్రం ఖమ్మం స్టేషన్‌లో ఆగి తిరిగి బయల్దేరింది. ఈక్రమంలోఖమ్మం శివార్లలో కొందరు రాళ్లతో దాడి చేయగా ఓ అద్దం ధ్వంసమైంది. దీంతో రైలు సిబ్బంది విశాఖపట్నం వెళ్లాక అద్దం మార్పించారు. అనంతరం ఘటనపై ప్రధాన మంత్రి కార్యాలయం అధికారులు ఖమ్మం ఆర్పీఎఫ్ కార్యాలయానికి శనివారం ఫోన్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్పీఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ రావడం వాస్తవమేనని ధ్రువీకరించారు. వందేభారత్ రైలు లోపల, బయట ఉన్న అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా ఏం జరిగినా పీఎంవోలోని వందేభారత్ విభాగానికి తెలిసిపోతుందని పేర్కొన్నారు. ఖమ్మం శివార్లలో జరిగిన దాడిని గుర్తించిన వారు ఫోన్ చేయగా.. సీసీ ఫుటేజీల ఆధారంగా రాళ్లతో దాడి చేసింది ముగ్గురు బాలురని తేలడంతో వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం ఖమ్మం శివారు రామన్నపేట ప్రాంతంలోనూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు విసిరిన వారిని కూడా గుర్తించటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సకాలంలో సత్యాన్ని వెలికితీయాలి

- దీనిలో ఫోరెన్సిక్ సైన్స్ పాత్ర కీలకం
- నల్సార్ వర్సిటీ సదస్సులో మాజీ సీజేఐ జస్టిస్ యు.యు. లలిత్



సదస్సులో పాల్గొన్న జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, వీసీ కృష్ణదేవరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: నేరాలు జరిగినప్పుడు సకాలంలో సత్యాన్ని వెలికితీయడం కత్తిమీద సాము లాంటిదని, దీనిలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు. లలిత్ అన్నారు. ట్రూత్ ల్యాబ్ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఫోరెన్సిక్ సైన్స్ వినియోగంపై నల్సార్ యూనివర్సిటీ శనివారం ఇక్కడ నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. క్రిమినల్ కేసుల్లోనే కాదు, సివిల్ కేసుల్లోనూ ఫోరెన్సిక్ సైన్స్ సేవలు అందించాలని సూచించారు. పరిశోధనకు కొత్త మార్గాలను అనుసరించడంతోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీని ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉందని మరో మాజీ సీజేఐ జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య అభిప్రాయపడ్డారు. శాస్త్రీయంగా సాక్ష్యాన్ని సమర్థవంతంగా రూపొందించడంలో ఫోరెన్సిక్ పాత్ర కీలకమైనదని అన్నారు.

ఆధారాలను వెలికితీయడంలో...

న్యాయ రంగంలో ఫోరెన్సిక్ సైన్స్ సహకారం అవసరమని, తద్వారా క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించే వీలు కలుగుతుందని తమిళనాడు మాజీ గవర్నర్ రాంమోహన్‌రావు అన్నారు. క్రిమినల్ కేసులు, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో ఆధారాలను వెలికితీసేందుకు ఫోరెన్సిక్ సైన్స్ తోడ్పడుతుందని తెలంగాణ హైకోర్టు సీజే, నల్సార్ వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానించారు. ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. రాంమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా, లా కమిషన్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ జస్టిస్ ఎం.జగన్నాథరావు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీపీ రెడ్డి తదితరులు మాట్లాడారు. డీజీపీ అంజనీకుమార్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ భవానీ ప్రసాద్, జస్టిస్ రఘురామ్, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవరావు, డా.గాంధీ పీసీ కాజా, పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూకే కోర్సుకు 15 మంది తెలంగాణ విద్యార్థులు

- రాష్ట్రంతో బ్రిటిష్ కౌన్సిల్ భాగస్వామ్య ఒప్పందం
- రాష్ట్రాన్ని విజ్ఞాన కేంద్రంగా మార్చడమే లక్ష్యం: మిత్తల్



సాక్షి, హైదరాబాద్: యూకేలో స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. రెండు వారాల కాలవ్యవధితో అందించే ఈ కోర్సుకు అయ్యే ఖర్చును బ్రిటిష్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లోంచి పూర్తిగా మెరిట్ ప్రాతిపదికగా 15 మందిని ఎంపిక చేశారు. హైదరాబాద్ విద్యాభవన్‌లో శనివారం కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, బ్రిటిష్ కౌన్సిల్ ప్రతినిధులు భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా 'స్కాలర్‌షిప్ ఫర్ ఔట్‌స్టాండింగ్ అండర్ గ్రాడ్యుయేట్ టాలెంట్ (స్కాట్)' ప్రోగ్రామ్ వివరాలను బ్రిటిష్ కౌన్సిల్ సౌత్ ఇండియా డైరెక్టర్ జనక పుష్పనాథన్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోలో 'హౌ టు బీ మోర్ రేషనల్ క్రియేటివ్ థింకింగ్, లాజిక్ అండ్ రీజనింగ్ (హేతుబద్ధంగా ఉండటం ఎలా? విమర్శనాత్మకత, తర్కం, హేతువాదన) అనే అంశాలపై మార్చి, ఏప్రిల్‌లలో రెండు వారాలపాటు కోర్సు చేస్తారని తెలిపారు. విద్యార్థులకు అవసరమయ్యే వీసా, ప్రయాణ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, యూకేలో కోర్సు ఫీజులు, వసతి, ఇతర ఖర్చులను బ్రిటిష్ కౌన్సిల్ భరిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆధునిక విజ్ఞాన కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు.

చంద్రబాబునూ సీబీఐ విచారించాలి

- వివేకా హత్యలో ఆయన ప్రమేయం.. సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని డిమాండ్
- తండ్రిపై ఆక్రోశంతో సీఎం జగన్‌పై లోకేశ్ పిచ్చి విమర్శలు
- టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. ప్రమాదాలు, గుండెపోట్లు
- ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి
- ఎన్టీఆర్ మృతిపై దర్యాప్తు చేయాలని మోదీ, అమిత్ షా, కేసీఆర్, జగన్‌ను కోరుతా



సాక్షి, అమరావతి: 'మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు సీఎంగా చంద్రబాబే ఉన్నారు.. ఈ కేసులో ఆయన ప్రమేయం ఉంది. అందువల్ల చంద్రబాబును కూడా సీబీఐ విచారించాలి'అని ఏపీ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వివేకా హత్య జరిగిన రోజు వైఎస్సార్ జిల్లా నుంచి చంద్రబాబుతో ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడారు? ఈ ఘటన జరిగాక మూడు నెలల వరకు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. మరి అప్పుడు ఎందుకు దోషులను పట్టుకోలేకపోయారు? ఆ హత్యలో ఆయన కూడా భాగస్వామి కనుకే పట్టుకోలేదా'అనే విషయాలన్నింటిపై సీబీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలు బయట పడతాయనే అప్పట్లో సీబీఐ రాష్ట్రంలోకి రాకూడదని చంద్రబాబు బ్యాన్ చేశారని గుర్తు చేశారు. అందువల్లే చంద్రబాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావు, అప్పటి డీజీపీ, కడప ఎస్పీ, కడప జిల్లాలోని టీడీపీ నాయకుల ఫోన్ కాల్స్‌పై ఆరా తీసి, సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నాని ఇంకా ఏమన్నారంటే..

వివేకా కేసుపై తప్పుడు ప్రచారం

- అన్ని కోణాల్లో వివేకానందరెడ్డి కేసుపై సీబీఐ విచారిస్తుంటే, దానికీ ఈ ఫోర్ ట్వంటీలు, పచ్చ మీడియాలు వక్రభాష్యం చెబుతున్నాయి. వారికి తోచిన వారందరినీ ముద్దాయిలు చేసేస్తారు. సీఎం సతీమణి వైఎస్ భారతమ్మనూ చేరుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు.
- చంద్రబాబు భార్యను మేం ఏమీ అననప్పటికీ వెక్కివెక్కి ఏడ్చాడు. భారతమ్మను మాత్రం నిందిస్తాడు. అవినాష్ రెడ్డి అయినా, నేనైనా, మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా సీఎం జగన్‌తో మాట్లాడాలంటే ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికో, లేదా నవీన్, లేదా కేఎన్ఆర్‌కో ఫోన్ చేసి మాట్లాడాల్సిందే కదా? ఈ విషయం అందరికీ తెలుసు. అయినా వక్రభాష్యాలా?
- వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత అవినాష్ రెడ్డి ఆ సమాచారం చెప్పడానికి వాళ్లకు ఫోన్ చేశారు. ఇందులో ఏం కొంపలు అంటుకుపోయాయని రామోజీరావు, చంద్రబాబు, బీఆర్ నాయుడు, రాధాకృష్ణ ఇష్టమొచ్చినట్లు దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నట్లు?
- బలవంతంగా పాదయాత్ర చేయిస్తున్నాడని తండ్రి చంద్రబాబుపై లోకేశ్‌కు మంట. తిండికి తప్ప దేనికీ పనికి రాని లోకేశ్.. తండ్రిపై ఉన్న ఆక్రోశంతో సీఎం జగన్‌పై పిచ్చి విమర్శలు చేయడం మానుకోవాలి. పప్పు గుత్తి లోకేశ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి.
- లోకేశ్ పాదయాత్రలో జనం ఎవరూ లేరు. నడవలేక కాళ్లు రుద్దుకుపోతున్నాయట. నువ్వు నడిచే నడకకు రోజుకు 20 సార్లు ఆయిల్ రాయాలంట. ఇది చాలదన్నట్లు నోరు తిరగని మూతి.. ఆ నోటితో సీఎం జగన్‌ను తిట్టడం.. ఇది తప్పు నీకేం తెలుసు?

ఎన్టీఆర్ మరణంపై హరికృష్ణ దర్యాప్తు కోరలేదా?

నారా రామ్మూర్తి నాయుడి అదృశ్యానికీ కారకుడు బాబే. ఆనాడు ఎన్టీఆర్ మరణానికీ చంద్రబాబే కారకుడు. టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. గుండెపోట్లు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. తన తండ్రి మరణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆనాడు హరికృష్ణ కోరారు. కావాలంటే పాత పేపర్లు తిరగేయండి. చంద్రబాబు చరిత్ర అందరికీ తెలుసు. మోదీ, అమిత్‌షా, కేసీఆర్, వైఎస్ జగన్‌ని ప్రత్యక్షంగా కలిసి ఎన్టీఆర్ మరణంపై దర్యాప్తు చేయాలని కోరతాను.

అందోల్ జోగిపేట చైర్మన్‌ను దింపేద్దాం

- 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంతకాలు
- కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేత

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాలోని అందోల్–జోగిపేట మున్సిపాలిటీ రాజకీయాలు ఊహించని విధంగా రోజుకో మలుపు తిరుగుతున్నాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై సొంత పార్టీ (బీఆర్ఎస్)కి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీనిపై శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో నోటీసును అందజేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. శనివారం ఉదయం 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమ కుటుంబ సభ్యులతో కలసి చిట్కుల్‌లోని చాముండేశ్వరీ అమ్మవారి ఆలయం ఆవరణలో సమావేశమయ్యారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల వ్యవహారశైలిపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, వారిని పదవిలో నుంచి దింపేయాలని తీర్మానించారు. అక్కడ నుంచి నేరుగా సంగారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ కలెక్టర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ వీరారెడ్డిని కలిశారు. ఆయన సూచన మేరకు ఇన్‌వార్డులో అవిశ్వాస తీర్మానం నోటీసును అందించారు. అక్కడి ఉద్యోగులు సోమవారం వచ్చి కలెక్టర్‌ను కలవాలని సూచించడంతో నోటీసు అందించి వెనుదిరిగారు.

మెజారిటీ కౌన్సిలర్ల వ్యతిరేకత

అందోల్ – జోగిపేట మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులున్నాయి. ఇందులో 14 మంది బీఆర్ఎస్, ఆరుగులు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం వీరిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు చైర్మన్‌ను వ్యతిరేకిస్తున్నారు. రోజూ చైర్మన్ వెంట ఉండే కౌన్సిలర్లు సైతం బహిరంగంగా చైర్మన్ తీరుపై విమర్శలు చేయడం విశేషం. కాగా, ఈ పరిణామంపై ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఎస్సీ కమిషన్‌కు ఆ అధికారం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించింది. స్పందించిన కమిషన్ 2022, నవంబర్ 29న జీవోలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ ఉత్తర్వుల కారణంగా బీసీ, ఓసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కొండెపాక కుమారస్వామి, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టగా పిటిషనర్ తరఫున సుంకర చంద్రయ్య వాదనలు వినిపించారు. ఆయన వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి జాతీయ ఎస్సీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేశారు. ప్రభుత్వసంస్థల ఉద్యోగుల సర్వీసు అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు విచారణ జరిపే అధికారం లేదని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.

వివరాలను సమర్పించండి

విద్యుత్‌సంస్థల్లో పదోన్నతుల్లో ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి ఇచ్చిన ప్రమోషన్లు అన్నింటిని సమీక్షించాలని 2019లో హైకోర్టు విద్యుత్ సంస్థలను ఆదేశించింది. అయినా ఆదేశాలను అమలు చేయకపోవడంతో ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీలపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన ఉన్నతన్యాయస్థానం ఫిబ్రవరి 8న వివరాలను సమర్పించాలని యాజమాన్యాలను ఆదేశించింది.

ధాన్యం అక్రమాలపై రెండో రోజు విచారణ


- లింగాయిపల్లి రైతులతో వివరాలు సేకరించిన ఏపీఎం




సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై అధికారులు విచారణ వేగవంతం చేస్తున్నారు. రెండో రోజూ విచారణ చేపట్టారు. శనివారం ఏపీఎం బాలకృష్ణ గండేడ్ మండల పరిధిలోని లింగాయిపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు ఆదేశాల మేరకు శుక్రవారం డీపీఎం చెన్నయ్య గండేడ్‌లో విచారణ చేపట్టారు. రైతులతో పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిందిగా ఆయన ఏపీఎంను ఆదేశించారు. ఈ మేరకు గ్రామంలో బ్రహ్మంగారి ఆలయంలో గ్రామకమిటీ మరియు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు అందుబాటులో లేకపోవడంతో ఇద్దరు రైతులు మాత్రమే రావడంతో వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మిగతా రైతులను సోమవారం విచారణ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటయ్యతో పాటు పలువురు గ్రామకమిటీ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్‌గా పరశురాముడు



కందనూలు: ఖేలో ఇండియా తెలంగాణ అథ్లెటిక్స్ టీం కోచ్‌గా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లికి చెందిన పరశురాముడు ఎంపికయ్యాడని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి స్వాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహిస్తుండగా ఈ పోటీలకు తెలంగాణ నుంచి ఇద్దరు అథ్లెటిక్స్ కోచ్‌లు వెళ్లారు. ఇందులో ఒకరిగా పరశురాముడుకు అవకాశం దక్కిందన్నారు. ప్రస్తుతం పరశురాముడు నల్లగొండ జిల్లా (గుండ్లపల్లి) డిండి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ బాలికల క్రీడా అకాడమీలో అథ్లెటిక్స్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. పరశురాముడి ఎంపికపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లావణ్య రెడ్డి, లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.





విద్యుత్ దీపకాంతులతో వెలిగిపోతున్న మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం

మన్యంకొండను అద్భుతంగా తీర్చిదిద్దుతాం

- వచ్చే ఏడాదికి రోప్‌వే నిర్మాణం పూర్తి
- పెద్దఎత్తున కల్యాణ మండపాల నిర్మాణం
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ తిరుపతిగా ప్రఖ్యాతిగాంచి 800 ఏళ్ల చరిత్ర గల మన్యంకొండ దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మన్యంకొండ ఆర్చి నుంచి దేవాలయం వైపు రూ.4.79 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం, రోడ్డు వెంట రూ.52 లక్షల వ్యయంతో వేసిన సెంట్రల్ లైటింగ్, ఆలయం ముఖద్వారం వద్ద రూ.27.65 లక్షలతో నిర్మించిన చెరువు కట్ట అభివృద్ధి పనులు, స్నాన ఘట్టాలు, భక్తుల సౌకర్యార్థం రూ.2.2 కోట్ల వ్యయంతో నిర్మించిన 18 వసతి గృహ సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం దేవాలయ పరిసరాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖలో అత్యుత్తమ గ్రేడ్ ఉన్న మన్యంకొండ ఆలయాన్ని ఏటా దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. డబుల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ స్నానాల కోసం ఘాట్, వసతి గృహాలు నిర్మించామని వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల నాటికి రాష్ట్రంలో తొలిసారిగా ఇక్కడే రూప్‌వే నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఒకేసారి అనేక పెళ్లిళ్లు చేసేలా కల్యాణ మండపాలు నిర్మిస్తామన్నారు. దిగువన అలివేలు మంగ దేవాలయ సమీపంలో నిర్మించే త్రీస్టార్ హోటల్ భక్తులు, పర్యాటకులకు ఎంతో ఉపయుక్తంగా ఉండనుందన్నారు. వంశపారంపర్యంగా అళహరి కుటుంబం ఆలయాన్ని కాపాడుతుందని కొనియాడారు. 10 లక్షల మొక్కలు నాటి దేవాలయ, అటవీ భూములను కాపాడుకుంటామని, ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు అద్భుతంగా ఏర్పాట్లు చేసిన దేవాలయ పాలకమండలి సభ్యులను, అధికారులను మంత్రి అభినందించారు. భక్తి శ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు జరుపుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ అనిత, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రైతుబంధు మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ఓబ్లాయిపల్లి సర్పంచ్ చంద్రకళ, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి భక్తుడికి అభిషేక భాగ్యం కల్పించాలి



అర్చకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆలయ ఈఓ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: మహాశివరాత్రి రోజు ప్రతి భక్తుడికి అభిషేక భాగ్యం కల్పించాలని జోగుళాంబ ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన ఈ నెల 17 నుంచి 21 వరకు జరగబోయే మహాశివరాత్రి వేడుకలపై అర్చకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా బాలబ్రహ్మేశ్వరుడికి గర్భాలయంలో సంప్రదాయ దుస్తులతో ఏకవార రుద్రాభిషేకాలు కొనసాగుతాయని, సంప్రదాయ దుస్తులతో రాని వారికి క్యూలైన్ దగ్గర లింగాభిషేకం సదుపాయం కలిగిస్తామని చెప్పారు. అలాగే ఐదు రోజులపాటు జరిగే ఉత్సవ ప్రకరణకు ఎక్కడెక్కడ ఎంత మంది అదనపు అర్చకులు కావాలో చెబితే జిల్లాలోని పలు ఆలయాల నుంచి పిలిపించే అవకాశం ఉందన్నారు. శివరాత్రి రోజు రాత్రి జరిగే యమకాల పూజలు, లింగోద్భవన కాలపూజలు, కల్యాణోత్సవం, యాగశాల, రథోత్సవం, తీర్థవళి వంటి ఘట్టాల గురించి ప్రస్తావిస్తూ ఆయా కార్యక్రమాలను ఎంతో గొప్పగా భక్తులను అబ్బురపరిచే విధంగా చేయించాలని సూచనలు చేశారు. శ్రీకాంత్‌శర్మ, ధనుంజయశర్మ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 50 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా రాములోరి కల్యాణం



రాములోరి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకొని బీచుపల్లిలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహ ఆచారి సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబుచేసి వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మార్మోగిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి నామస్మరణ



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



హాజరైన భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. నిత్య పూజలతో పాటు ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణాల నడుమ ధ్వజారోహణం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఊరేగింపులో శాలిబండ రాఘవేంద్ర భజనమండలి భజనలు, పాలమూరు రాఘవేంద్ర సేవాసమితి కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆలయం సమీపంలో ఉన్న ధర్మకర్త నరహరి భీంసేనాచార్య ఇంటి నుంచి పెళ్లివస్త్రాలు, వడిబియ్యాన్ని మేళతాళాలతో తీసుకొచ్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు వడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ హాజరై ఆలయంలో పూజలు చేశారు.

ఘనంగా పుష్ప రథోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పుష్ప రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన రథంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం రథాన్ని గోవింద నామస్మరణల నడుమ భక్తులు ముందుకు లాగారు. పూల రథోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

పరిశ్రమ మూసివేయాలని గ్రామస్తుల ఆందోళన

బాలానగర్: మండలంలోని గుండేడ్ శివారులో ఉన్న మహవీర్ పరిశ్రమను మూసివేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు శనివారం సైతం పరిశ్రమ ఎదుట ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి వంద మీటర్ల దూరంలో ఉన్న పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో చాలా మంది రోగాలబారిన పడ్డారని.. దీంతో గతంలో ప్రభుత్వం గ్రామంలో వారం పాటు వైద్య శిబిరం ఏర్పాటుచేసి చికిత్స అందించిన విషయాన్ని గ్రామస్తులు గుర్తుచేశారు. పరిశ్రమను తిరిగి ప్రారంభించేందుకు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా గ్రామస్తులందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించినా ఎలా తెరిచారని ప్రశ్నించారు. ఆదివారం పరిశ్రమ గేటు వద్దే వంటా–వార్పు నిర్వహించి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.